నేటి దినపత్రిక
# సూర్య

ఆదివారం
14 జనవరి
2024
పేజీలు 8

పల్నాడు జిల్లా


విజయమే లక్ష్యంగా...

# సీఎం జగన్ ప్రయోగాల కూర్పు

నేటి దిన పత్రిక సూర్య బ్యూరో, పల్నాడు జిల్లా

మన బలం కంటే ప్రత్యర్థుల బలహీనతలను తెలుసుకుంటే విజయం సాధించవచ్చున్న చాణుక్యుని వ్యూహాల కనుగుణంగా వైసిపి మఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రయోగాల కూర్పుకు శ్రీకారం చుడుతున్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని నలుదిశలా దిగ్భంధనం చేసి విజయం సాధించాలని వ్యూహాత్మకంగా పావులు కదుపుతోన్న టిడిపి, జనసేన వ్యూహానికి వైసిపి అధినేత జగన్ ప్రతి వ్యూహం సిద్దం చేసి అభ్యర్థులను ఖరారు చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో పాత, కొత్త, యువనేతలను ఎన్నికల రంగంలోకి దించి అఖండ విజయాన్ని నమోదు చేసుకున్నారు. ఈ నేపధ్యంలో 2024లో కూడా మరో వ్యూహాన్ని అమలు చేసి విజయం సాధించాలన్న పట్టుదలతో వైసిపి అధినేత జగన్

మిగతా 3వ పేజీలో



- టీడీపీ ద్విముఖ వ్యూహానికి.. వైసీపీ ప్రతివ్యూహం
- నియోజకవర్గాల అభ్యర్థుల మార్పుతో విజయానికి శ్రీకారం
- బిసి అభ్యర్థులను రంగంలోకి తీసుకొచ్చే ఎత్తుగడ
- ఆపరేషన్ ఆకర్షతో ప్రత్యర్థుల ధైర్యాన్ని దెబ్బకొట్టే వ్యూహం
- మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి నేతలతో మంతనాలు






చోరీలకు పాల్పడిన

# ముఠా అరెస్ట్



- రూ.80 లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం
- 4 కార్లు,15 బైకులు స్వాధీనం
- 850 గ్రాముల బంగారం, 2.5 కేజిల వెండి
- చోరీలకు పాల్పడిన 13 మంది అరెస్టు
- ప్రధాన నిందితుడుపై పిడి యాక్ట్ నమోదుకు సిఫార్స్
- ఎస్పీ రవిశంకర్ రెడ్డి వెల్లడి



నేటి దినపత్రిక సూర్య బ్యూరో, పల్నాడు జిల్లా

నేరాల నియంత్రణలో పల్నాడు జిల్లా పోలీసు యంత్రాంగం దూసుకుపోతోంది. ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన, చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఇటీవల జిల్లాలో చోటుచేసుకుంటున్న అనేక చోరీలకు పాల్పడిన వారిని అరెస్టు చేయడమే కాకుండా రికవరీ కూడా బాగానే చేస్తున్నారు. ముఖ్యంగా చోరీల నియంత్రణకు చేపడుతున్న

మిగతా 3వ పేజీలో







## ప్రపంచ మరుగు దొడ్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం




నూజెండ్ల, మేజర్‌న్యూస్
ప్రపంచ మరుగు దొడ్ల దినోత్సవం సందర్భంగా మండలంలో జడ్పీ హైస్కూల్ నందు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్ డి రవికుమార్, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బారామయ్య లు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని ఉపయోగించాలి, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి కుటుంబం మరుగుదొడ్డి నిర్మించుకోవాలి.

## ఆయుష్ గ్రామంలో ఆయుషు మేళా వైద్య శిబిరం




నూజెండ్ల, మేజర్‌న్యూస్
ఆయుష్ గ్రామంలో ఆయుషు మేళా వైద్య శిబిరం డాక్టర్ ఆర్ శ్రీనివాస్ ప్రభుత్వ ఆయుష్ వైద్య అధికారి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ములకలూరు ఆయుష్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థిని విద్యార్థులను సమావేశం నిర్వహించారు. ప్రతిదినం ప్రతి ఇంటా ఆయుర్వేదం "అనే కార్యక్రమం గురించి తెలియ జేస్తూ మన ఆరోగ్యం గృహవైద్యం తోనే సాధ్య పడుతుందని తెలిపారు.

## అఖిలభారత 70వ సహకార వారోత్సవాలు



నూజెండ్ల మేజర్ న్యూస్
మండల కేంద్రం మైన నూజెండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో శనివారం నెహ్రూ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా సొసైటీ చైర్పర్సన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి అధ్యక్షతన నూజెండ్ల సొసైటీ కార్యాలయంలో వారోత్సవాలు జండా ఆవిష్కరించినారు. అనంతరం నూజెండ్ల సొసైటీ సీఈవో గంగినేని శ్రీనివాసరావు సహకార సభ్యులచే ప్రతిజ్ఞ చే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్పర్సన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి మాట్లాడుతూ సహకార ఉద్యమంలో ప్రతి ఒక్కళ్ళు భాగస్వాములు కావాలని కోరారు. అలాగే సహకార సంఘాల్లో రైతులకి అనేక సబ్సిడీ ఎరువులు మరియు రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు ఈ అవకాశాలను ప్రతి ఒక్క రైతు ఉపయోగించుకోవాలి కోరారు. ఈ కార్యక్ర మంలో ములకలూరు సర్పంచ్ కంచర్ల బాబు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయ కులు జడ్డ రామయ్య. అమర ఏడుకొండలు. వంగూరు హుమయ్య. గాదె నాగార్జున్ రెడ్డి. చిట్టి గురవారెడ్డి. కుందూరి హనుమ రెడ్డి పాల్గొన్నారు.

## నేడు గోదా రంగ నాధుల స్వామి వారి కళ్యాణ మహోత్సవం

రాజుపాలెం, మేజర్‌న్యూస్
మండల కేంద్రమైన రాజుపాలెంలో వేంచేసి ఉన్న పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానమునందు ఆదివారం ఉదయం 9.00 గంటలకు గోదా రంగ నాధుల స్వామి వారి కళ్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ పొత్తూరి వెంకట రమ సుబ్బారావు దంపతులు తెలిపారు. కావున యావన్మంది భక్తులు స్వామివారి కళ్యాణ మహోత్సవమును తిలకించి, స్వామివారి కృపకు పాత్రులై, తీర్థ ప్రసాదములు స్వీకరించవలసిందిగా వారు కోరారు. అంతేకాకుండా ఈనెల 14, 15, 16 తేదీలలో ఆలయం వద్ద "సత్య హరిచంద్ర" గొప్ప పౌరాణిక నాటక ప్రదర్శనలు ఉన్నాయని కళాకారులు, కళాభిమానులు ఈ నాటక ప్రదర్శనను తిలకించి కళాకారులకు తమ అభినందనలు అందజేయవలసిందిగా కోరారు.

# కన్నా ఆధ్వర్యంలో మాదలలో ముగ్గుల పోటీలు

సత్తెనపల్లి ప్రతినిధి, మేజర్‌న్యూస్
పల్నాడు జిల్లా, సత్తెనపల్లి నియోజకవర్గం, ముప్పాళ్ల మండలం, మాదల గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నియోజకవర్గస్థాయిలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి టిడిపి ఇన్చార్జి కన్నా లక్ష్మీనారాయణ విచ్చేసి ముగ్గులను తిలకించి, విజేతలకు బహుమతులను అందజేశారు. శని వారం జరిగిన ఈ పోటీలలో మొదటి బహుమతి పోలిశెట్టి శిరీష, రెండవ బహుమతి చెరుకూరి రాజేశ్వరి, మూడో బహుమతి నట్టు రత్నకుమారి, నాలుగో బహుమతి కందిమల్ల అచ్చలమ్మలు గెలుచుకున్నారు. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతిని మాజీ మంత్రివర్యులు, కన్నా అందజేశారు. అనంతరం కన్నాని శాలు వా తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వాహణకార్య దర్శి యెల్లి నేడి రామస్వామి, మండల పార్టీ అధ్యక్షులు బత్తుల నాగేశ్వర రావు, మాదల గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





**టీడీపీలో చేరిన వైసిపి కార్యకర్తలు...!!**
ముప్పాళ్ల మండలం లోని రుద్రవరం గ్రామం లో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు శనివారం తెలుగుదేశం పార్టీ లో చేరారు. రుద్రవరం గ్రామస్తులు బండెల నరేష్, గొర్రిపాటి సురేష్, గొర్రిపాటి ఎల్లయ్య, కొండా మాధవరావు, గంట రమేష్ బాబు, జెర్రిపోతు వెంకటేష్, కారంశెట్టి మాధవ రావు, ముకల కోటేశ్వరరావు, మర్రి వెంకటేశ్వరరావు, మట్టని లాజర్, కారంశెట్టి శామ్యూల్, మల్ల వరపు శ్రీనివాసరావు లు మాజీ మంత్రి వర్యులు, సత్తెనపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కన్నా లక్ష్మీనారాయణ, వారికి పార్టీ కండు వా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి యెల్లినేడి రామస్వామి, ముప్పాళ్ళ మండల పార్టీ అధ్యక్షులు బత్తుల నాగేశ్వర రావు, గ్రామస్తులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిరి డెవలపర్స్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలకు విశేష స్పందన




గురజాల, మేజర్‌న్యూస్
గురజాల నగర పంచాయతీ పరిధిలోని పులిపాడు రోడ్డులో గల సిరి వెంచర్లో సిరి డెవలపర్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గురజాల ఎస్సై అనంత కృష్ణ పాల్గొని ముగ్గులను తిలకించారు. ఆమె మాట్లాడుతూ తెలుగువారికి సంక్రాంతి మూడు రోజుల పెద్ద పండుగని ఈ పండుగను ప్రతి ఒక్కరూ ఎంతో ఆనంద ంగా జరుపుకోవాలని ప్రతి ఒక్కరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ముగ్గుల పోటీలో మొదటి బహుమతి పొందినటువంటి బి.పూజ, రెండో బహుమతి పొందినటువంటి భ్రమరాంబ, మూడవ బహుమతి పొందినటువంటి ప్రమీల కు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా అనిత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ మన్నెం ప్రసాద్, మా చిట్టి శివ నీళ్ల రవి, గంధం ప్రవీణ్ కుమార్, మద్దినేని కొండ, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



మాచర్ల, మేజర్‌న్యూస్
పట్టణంలోని పిడబ్ల్యుడి కాలనీకి చెందిన గనిపల్లి మరియదాస్ అనే వ్యక్తి ఈనెల11వ తేదీ సాయంత్రం నుండి కనబడుటలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. అదృశ్యమైన వ్యక్తికి మతిస్థిమితం సరిగా లేదని, ఆచూకీ తెలిసినవారు ఈ క్రింది నెంబర్లకు ఫోన్ చేసి తెలపగలరని కుటుంబ సభ్యులు కోరారు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు 8008057048, 8008690180, సిఐ9440796240,ఎస్సై 8501863727.

## కోడి పందేలు నిర్వహిస్తే కటకటాలే



రెంటచింతల, మేజర్‌న్యూస్
సంక్రాంతి పండుగ నేపథ్యంలో మండల పరిధిలో కోడి పందేలు,పేకాట,గుండాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కె.వి నారాయణరెడ్డి హెచ్చరిం చారు.శనివారం నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఆయన సమావేశంలో మాట్లాడుతూ సంప్రదాయ క్రీడ పేరుతో కోడి పందేలు నిర్వహించే వారిపై ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదుతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి సంప్రదాయ క్రీడల్లో పాల్గొని సంక్రాంతి పండుగను ఉత్సాహంగా జరుపుకోవాలని సూచించారు.కోడి పందాల కట్టడికి ప్రజలు పోలీసులకు సహరించాలని కోరారు. ఈ సందర్భ ంగా ఆయన మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా మెల్విన్ జోన్స్ జయంతి




మాచర్ల టౌన్, మేజర్‌న్యూస్
లైన్స్ క్లబ్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ 145వ జయంతి కార్యక్రమం పట్టణంలోని చక్రధర్ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా లైన్స్ క్లబ్ సభ్యులు మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 10 మంది పేదలకు చీరల పంపిణీ కార్యక్రమం, పండ్ల వ్యాపారి వల్లికొండ శ్యామ్, పూల వ్యాపారి అన్వర్ భాషలకు నీడ గొడుగులను అందజేశారు. గవర్నర్స్ అడ్వైజర్ లయన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి, లయన్ చుండూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచంలో లైన్స్ ద్వారా సేవా కార్యక్రమాలకు పునాది వేసిన మహనుభావుడు మెల్విన్ జోన్స్ అని వక్తలు అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హరీష్ అంకా ప్రకాష్, నరసింహారావు ఫాస్ట్ ప్రెసిడెంట్ . అల్లం కోటిరెడ్డి, పోలూరి నరసింహారావు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# "రాయపాటి" వాఖ్యలను ఖండించిన " టిడిపి"

సత్తెనపల్లి ప్రతినిధి, మేజర్‌న్యూస్
సైకో ముఖ్యమంత్రి పార్టీలోకి వెళ్ళాలి అనే నిర్ణయం తీసుకొన్న గడియల్లోనే ఒక సైకో గా మాట్లాడిన రాయపాటి రంగబాబు వాఖ్యలను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవి, రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. శనివారం వారు సత్తెనపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాయపాటి రంగబాబు తెదేపా పార్టీకి రాజీనామా చేసిన అనంతరం ఆయన, నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ లపై మాట్లాడిన మాటలు, ఉపయోగించిన




భాష, ప్రవర్తించిన తీరును తీవ్రంగా ఖండించారు. మీ నాన్న తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన తరువాత రెండు సార్లు లోక్ సభ సీటు ఇచ్చిన సందర్భాన్ని నీవు మరిచావా.. రంగబాబు అని ప్రశ్నించారు. కన్నా లక్ష్మీనారా యణ సత్తెనపల్లి వచ్చిన అతి తక్కువ సమయంలోనే ఆయనకు ఉన్న రాజకీయ చతురతతో నియోజక వర్గ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. మిమ్మల్ని, మరి మీ కుటుంబాన్ని చంద్రబాబు నాయుడు ప్రోత్సహించిన మాట వాస్తవం కాదా...? మీరు పార్టీ వీడాలి అనేది మీ వ్యక్తి గత నిర్ణయం. కానీ వీడే ముందు ఏదో అభాండాలు వేయాలి, అసత్య ప్రచారం చేయాలి అనుకోవడం సరికాదన్నారు. జిల్లా అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సర్వేపల్లి సీతయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి నూర్ భాషా జాన్ బాబు, లీగల్ సెల్ నాయకులు షేక్ జానీ ఖాజావలి, పట్టణ ఉపాధ్యక్షులు శిఖా ఏడుకొండలు,14 వార్డు అధ్యక్షులు షేక్ జానీ భాష ఈ సమావేశంలో పాల్గొన్నారు.



# సంక్రాంతి

**నేటి దినపత్రిక సూర్య, పల్నాడు బ్యూరో**

సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే కాలమే మకర సంక్రమణము. మకర సంక్రమణము నుండి ఉత్తరాయణ పుణ్యకాలము ప్రారంభము అవుతుంది. ఆ తరువాత కుంభ, మీన, మేష, వృషభ, మిథున రాశులలో కొనసాగినంత కాలము ఉత్తరాయ ణము. శారీరక పరిశ్రమకు, పూజలకు, సాధనలకు, కృషికి అనువైన, ఆవశ్యకత ఉన్న కాలము ఉత్తరాయనము.కర్కాటక రాశిలోకి సూర్యుడు ప్రవేశించిన దగ్గరినుండి మొదలై, ఆ తరువాతసింహ, కన్య, తుల, వృశ్చిక, ధనూరాశులలో కొనసాగినంత కాలము దక్షిణాయణము. మానసికమైన అర్చనకు, ధ్యానానికీ, యోగానికీ, దీక్షలకు,బ్రహ్మచర్యానికి, నియమ నిష్టలకు అనువైన, ఆవశ్యకత ఉన్న కాలము దక్షిణాయణము. పన్నెండు నెలల సంవత్సర కాలములో ఆరు నెలల దక్షిణాయణము దేవతలకు ఒక రాత్రి, ఆరు నెలల ఉత్తరాయణము దేవతలకు ఒక పగలు. కనుక దేవతలు మేలుకునే కాలము ఉత్తరాయణ పుణ్య కాలము. కనుకనే ఉత్తరాయనము వరకూ ఎదురు చూసి ఉత్తరాయణము ప్రవేశించిన తర్వాత తనువును చాలించాడు మహానుభావుడైన భీష్ముడు. "సంక్రాంతి" లేదా "సంక్రమణం" అంటే చేరుట అని అర్థం. జయసింహ కల్పద్రుమం అనే గ్రంథంలో "సంక్రాంతి"ని ఇలా నిర్వచించారు – తత్ర మేషాదిషు ద్వాదశ రాశి క్రమణేషు సంచరతః సూర్యస్య పూర్వస్మాద్రాశే ఉత్తరః రాశౌ సంక్రమణ ప్రవేశః సంక్రాంతిః – మేషం మొదలైన 12 రాశులలో సంచరించే సూర్యుడు ముందున్న రాశి నుండి తరువాతి రాశిలోనికి ప్రవేశించడమే సంక్రాంతి – సూర్యుని చలనంలో (రథయాత్రలో) ఘట్టాలు నాలుగు. అవి మేష, తుల, కటక, మకర సంక్రమణాలు. వీటిలో మకర సంక్రమణాన్ని "సంక్రాంతి పండుగ"గా వ్యవహరిస్తారు. మార్గశిరం పూర్తి కాగానే ఉత్తరాయణం మొదలవుతుంది.

**దానాదులు :** ఉత్తరాయణ పుణ్యకాలమైన సంక్రాంతి రోజున చేయు ఏ దానమైన శ్రేష్టమైనదని చెప్పబడింది. ధాన్యం, ఫలాలు, విసనకర్ర, వస్త్రం, కాయగూరలు, దుంపలు, నువ్వులు, చెరకు మొదలయినవి దానం చేస్తారు. ఇవి కాక ఈ కాలమందు చేయు గోదానం వలన స్వర్గ వాసం కలుగునని విశ్వసిస్తారు.

**భోగి మంటలు :** ఇది సాధారణంగా జనవరి 14న జరుపుతారు. ఈ రోజున ఉదయం తెల్లవారక ముందే, అంటే 3:30, 4:00 మధ్యలో అందరూ లేచి భోగి మంటలు వెలిగిస్తారు. దీనిని సంవత్సరంలో ఆ కాలంలో ఉండే చలి పారద్రోలటానికే కాక ఇంకో సందర్భంగా కూడా జరుపుకుంటారు. ఇంట్లో ఉండే పాత చీపుర్లూ, తట్టలూ, విరిగిపోయిన బల్లలూ వగైరాలను వదిలేసి, కొత్తవాటితో నిత్య నూతన జీవితం ఆరంబించటానికి గుర్తుగా కూడా ఈ రోజున భోగి మంటలు వెలిగిస్తారు. సాయంత్రం పూట చాలా ఇళ్ళలో స్త్రీలు, చిన్న పిల్లలు బొమ్మల కొలువును ఏర్పాటు చేస్తారు. దీనిలో పిల్లలు తమ దగ్గర ఉన్న వివిధ రకాల ఆటవస్తువులను ప్రదర్శనగా ఉంచి ఆనందిస్తారు. ఇంకొంత మంది భోగి పళ్ళ పేరంటం ఏర్పాటు చేస్తారు. ఇక్కడ పేరంటాళ్ళు, బంధువులు సమావేశమై, రేగిపళ్ళు, శనగలు, పూలు, చెరుకుగడలు, కొన్ని నాణాలను కొత్త బట్టలు వేసుకున్న పిల్లలపై ఆశీర్వాద సూచకంగా కుమ్మరించి దిష్టి తొలగిస్తారు. ఈ పేరంటానికి వచ్చినవారికి తాంబూలాలతో పాటు పట్టుబట్టలూ, పసుపు–కుంకుమలూ పెట్టడం ఆనవాయితీ.

**సంక్రాంతి రోజున గ్రామోత్సవానికి విచ్చేసిన స్వామివారు**

రెండవ రోజయిన సంక్రాంతి నాట పాలు పొంగించి, దానితో మిఠాయిలు తయారు చేస్తారు. దాదాపుగా అందరి ఇళ్ళలో అరిసెలు, బొబ్బట్లు, జంతికలు,చక్కినాలు, పాలతాలుకలు, సేమియాపాయసం, పరమాన్నం, పులిహోర, గారెలు మొదలయిన వంటకాలు చేసి, కొత్తబట్టలు ధరించి ఈ పండుగను ఆస్వాదిస్తారు.ఈ రోజున పితృదేవతలకు తర్పణాలు వదులుతారు. ప్రతీ సంక్రమణానికీ పితృతర్పణాలు ఇవ్వాలి కానీ, మిగిలిన పదకొండు సంక్రమణాలకు ఇవ్వకపోయినా, ఈ మకర సంక్రమణానికి మాత్రం తప్పకుండా పిత్ర తర్పణాలు ఇస్తారు. సంక్రాంతి రోజులలో మనము చూసే ఇంకో సుందర దృశ్యం, గంగిరెద్దులను ఆడించే గంగిరెద్దులవారు. చక్కగా అలంకరించిన గంగిరెద్దులను ఇంటింటికీ తిప్పుతూ, డోలు, సన్నాయి రాగాలకు అనుగుణంగా వాటిచేత చేయించే నృత్యాలు చూడటానికి చాలా రమణీయంగా ఉంటాయి. ఆ గంగిరెద్దులు మనము ఇచ్చే కానుకలను స్వీకరిస్తున్నట్లుగా తలలు ఊపుతూ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మోకాళ్ళ మీద వంగటం వంటి విద్యలు వాటికి నేర్పిస్తారు. అయ్యగారికి దండం పెట్టు, అమ్మగారికి దండం పెట్టు అంటూ గంగిరెద్దుల వాళ్ళు సందడి చేస్తారు. కొత్త ధాన్యము వచ్చిన సంతోషంతో మనము వారికి ధాన్యం ఇస్తాము. హరిలో రంగ హరీ అంటూ నడినెత్తిపై నుంచి నాసిక దాకా తిరుమణి పట్టెలతో, కంచు గజ్జెలు ఘల్లుఘల్లుమనగా చిందులు త్రొక్కుతూ, చేతుల్లో చిరుతలు కొడుతూ, కోడిగుడ్డు లాంటి బోడి తలపై రాగి అక్షయపాత్ర కదలకుండా హరిదాసు ప్రత్యక్షమవుతాడు.

**కనుమ :** మూడవ రోజయిన కనుమ వ్యవసాయంలో తమకు ఎంతో చేదోడువాదోడు ఉన్నందుకు పశువులకు శుభాకాంక్షలు తెలుపటానికి జరుపుతారు. కొన్ని ప్రాంతాలలో కోడి పందాలు కూడా నిర్వహిస్తారు. అయితే ఆ పందాలను జీవహింసగా భావించి రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. అంతే కాదు, వనభోజనాలను కూడా ఈరోజే నిర్వహిస్తుంటారు. కనుమ నాడు మినుము తినాలనేది సామెత. దీనికి అనుగుణంగా, ఆ రోజున గారెలు, ఆవడలు చేసుకోవడం ఆనవాయితీ. కనుమ మరునాటిని ముక్కనుమ అని అంటారు. దీనికి బొమ్మల పండుగ అని పేరు. దక్షిణ భారతదేశం లోని ప్రజలు ఈ పండుగ మూడు రోజులను శ్రద్ధాసక్తులతో జరుపుకుంటారు. ఉత్తర భారతదేశంలో మాత్రం ఈ పండుగలోని రెండవ రోజయిన మకర్‌సంక్రాంతి లేదా లోరీని మాత్రమే జరుపుకుంటారు. కనుమ రోజున మాంసాహారం తినడం ఆంధ్ర దేశాన ఆనవాయితీగా వస్తూంది. మాంసాహారులు కాని వారు, గారెలతో (మినుములో మాంసకృతులు హెచ్చుగా ఉంటాయి కనుక దానిని శాకాహార మాంసంగా పరిగణించి కాబోలు) సంతృప్తి పడతారు. అలాగే కనుమ రోజున ప్రయాణాలు చెయ్యకపోవడం కూడా సాంప్రదాయం.



## చోరీలకు పాల్పడిన ముఠా అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

చర్యల కారణంగా పోలీసులకు ప్రజామోదం లభిస్తుంది. భాగంగా పల్నాడు జిల్లాలోనే కాకుండా, తెలంగాణ ప్రాంతంలో కూడా చోరీలకు పాల్పడిన దొంగలను అదుపులోనికి తీసుకోవడమే కాకుండా సొమ్ము రికవరీ కూడా చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం దాచేపల్లి లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పి రవిశంకర్ రెడ్డి చోరీలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. రెంటచింతల మండలం గోలి గ్రామానికి చెందిన పొన్నూరి చిన సత్యానందం 13 మందితో గ్యాంగ్ ఏర్పాటు చేసుకొని 25 చోరీలకు పాల్పడ్డాడని ఎస్పీ వివరించారు. వీటిలో పల్నాడు జిల్లాలో ని దాచేపల్లి పిడుగురాళ్ల,మాచవరం,గురజాల, ఈపూరు, సత్తనపల్లి,కారంపూడి, మాచర్ల, దుర్గి ఉండగా, గుంటూరు జిల్లాలోని చేబ్రోలు, ఏలేశ్వరం, పిఠాపురం, తెలంగాణలోని మిర్యాలగూడెం ప్రాంతాలలో చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. పొన్నూరు చిన్న సత్యానందం చోరీల ప్రస్థానం రెంటచింతలతో మొదలైంది అన్నారు. ఊరిలో పాటలు పడిన సత్యానందం జైల్లోనే ఉండగానే అనేకమంది అక్కడ ఆయనకు తోడయ్యారన్నారు. అందరు కలిసి ఒక గ్యాంగ్ గా ఏర్పడి చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. ఇప్పటివరకు వీరి దగ్గర నాలుగు కార్లు, 15 బైకులు, 850 గ్రాముల బంగారం, 2.5 కేజీల వెండిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. వీటి విలువ 80 లక్షలు ఉంటుందని తెలిపారు. పొన్నూరి చిన్న సత్యానందం పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని సిఫార్సు చేసినట్లుగా ఎస్పీ రవిశంకర్ రెడ్డి తెలిపారు. చోరీలకు పాల్పడిన ఈ గ్యాంగ్ ను నేర విభాగం అడిషనల్ ఎస్పీ చంద్రశేఖర్, గురుజాల డిఎస్పి ఏ పల్లం రాజు ఆధ్వర్యంలో దాచేపల్లి సిఐఏ సురేంద్రబాబు, ఎస్సైలు శివ నాగరాజు, ఎస్కై సమీర్ భాష, ఎస్సై సంధ్యారాణి, సిబ్బంది హెచ్ సి రాఘవయ్య, వెంకటరమణా పీసి లు వెంకటరమణ నాయక్, జబ్బర్ నాయక్, కోటేశ్వరరావు, గోవింద నాయక్ అరుణ్ కుమార్, పవన్ హొంగార్డు సాంబశివరావు, చాకచక్యంగా పట్టుకున్నందుకు ఎస్పీ రవిశంకర్ రెడ్డి వారి అభినందించారు. ఈ సందర్భంగా వారికి రివార్డులను చేశారు.

## విజయమే లక్ష్యంగా.. సీఎం జగన్ ప్రయోగాల కూర్పు

(మొదటి పేజీ తరువాయి)

వ్యూహాత్మకంగా వెళుతున్నారు. సామాజిక సమీకరణాలను పరిగణలోకి తీసుకుని ఎక్కడ ఏ సామాజిక వర్గం అధికంగా ఉంటుందో ఆయా నియోజకవర్గాలలో సదరు సామాజిక వర్గంకు చెందిన బలమైన నేత రంగంలోకి దించాలన్న నిర్ణయానికి వచ్చి గెలుపు గుర్రాలనే రంగంలోకి దించుతున్నారు.ఉమ్మడి గుంటూరు జిల్లాలో 17 నియోజక వర్గాలు ఉంటే వాటిలో పల్నాడు ప్రాంతానికి సంబంధించి 7నియోజకవర్గాలు ఉన్నాయి. పల్నాడు నియోజకవర్గాలకు సంబంధించి సర్వేల రిపోర్టులే కాకుండా స్థానిక నేతల రిపోర్టులను పరిగణలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేయాలన్న నిర్ణయంలో భాగంగా అభర్యర్థులును ఖరారు చేస్తున్నారు.అయితే ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేల మార్పు విషయంలో ఒక ప్రణాళికను తయారు చేసుకుని అందుకు అనుగుణంగా నిర్ణయం చేస్తున్నారు.కాగా, ప్రత్యర్థుల ఎత్తులకు పైఎత్తు వేసే ప్రక్రియలో భాగంగా అభ్యర్థులును రంగంలోకి దించాలన్న యోచనతో వైసిపి అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది.

**బీసీ అభ్యర్థులను రంగంలోకి దించే ఎత్తుగడ :**

రానున్న ఎన్నికల్లో బీసీల ఓట్లు ప్రాధాన్యత సంతరించుకున్న నేపథ్యంలో బీసి అభ్యర్థులను రంగంలోకి దించే ఎత్తుగడకు వైసిపి శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు బీసిలు తమ వైపే ఉన్నారన్న భావనతో టిడిపి బిసి వర్గానికి చెందిన పుత్తా మహేష్ యాదవ్‌ను రంగంలోకి దించాలని ప్రయత్నాలు చేసింది. అయితే నర్సరావుపేట సిటింగ్ ఎంపి లావు కృష్ణదేవ రాయలును తప్పించి బీసీ అభ్యర్థిని రంగంలోకి దించాలని వైసిపి భావించిన నేపథ్యంలో లావు కృష్ణదేవరాయలును టిడిపిలోకి ఆహ్వానించి నర్సరావుపేట బరిలోనే నిలపాలని టిడిపి భావిస్తున్నాట్లు తెలుస్తోంది.కాగా, వైసిపి అధినేత వ్యూహాత్మకంగా నర్సరావుపేట పార్లమెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలలో బీసీ సామాజిక వర్గంకు చెందిన నేతలను రంగంలోకి దించాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం అందుతోంది. ఇదిలా వుండగా తొలుత నర్సరావుపేట ఎంపిగా ఉన్న లావు కృష్ణదేవరాయలును గుంటూరు పార్లమెంటుకు మార్చి నర్సరావుపేట పార్లమెంటుకు బిసి అభ్యర్థిని రంగంలోకి దించాలని చూశారు. అయితే కృష్ణదేవరాయలు గుంటూరుకు వెళ్ళనని స్పష్టం చేయడంతో అసెంబ్లీ అభ్యర్థులను మార్చాలన్న యోచనలోఉన్నట్లు సమాచారం అందులోంది. ఇందులో భాగంగా నర్సరావుపేట పార్లమెంటు నియోజకవర్గంలో ఒక్క చిలకలూరి పేట సీటును మార్చిన వైసిపి మిగిలిన ఆరు నియోజకవర్గఆలలోని అభ్యర్థులను యధాతంథంగా ఉంచనున్నట్లు తెలుస్తోంది.

**ఆపరేషన్ ఆకర్షతో ప్రత్యర్థుల నైతిక స్థైర్యాన్ని దెబ్బకొట్టే వ్యూహం :**

మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఆపరేషన్ ఆకర్ష వ్యూహాన్ని అమలు చేయాలని వైసిపి అధిష్టానం నేతలకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఇప్పటికే ప్రత్యర్థి పార్టీలకు చెందిన కొంత మంది పనిచేసే నేతలను రహస్యంగా కలుసుకుని వైసిపిలో చేర్చుకోవడానికి ముహూర్తాన్ని ఖరారు చేసుకుంటున్నట్లు సమాచారం అందుతోంది. రానున్న ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా జరిగే అవకాశం ఉన్నందున ఏ చిన్న అవకాశం వచ్చినా వదిలి పెట్టవద్దని ఇందులో ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వవద్దని కూడా అధిష్టానం సూచించినట్లు తెలుస్తుంది. మొత్తం మీద 2024 ఎన్నిలల్లో విజయమే అక్ష్యంగా ప్రధాన పార్టీలు పోటీ పడుతోన్న నేపథ్యంలో ఒకపై ఒకరు వ్యూహాత్మక అడుగులు వేస్తూ పై చేయి సాధించాలన్న భావనలో ఉన్నట్లు తెలుస్తుంది.

### దుర్గా సిమెంట్స్ వర్క్స్ ఆధ్వర్యంలో
## 35వ రోడ్డు భద్రత వారోత్సవాలు



దాచేపల్లి, మేజర్‌న్యూస్

దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామ శివారులోని ఆంధ్ర సిమెంట్స్ లిమిటెడ్,దుర్గా సిమెంట్ వర్క్స్ నందు 35 రహదారి భద్రతా వారోత్సవం -2024 కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆంధ్ర సిమెంట్స్ లో 35 వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు కు ముఖ్యఅతిథిగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మాచెర్ల డి.శేషు కుమార్ విచ్చేసి భద్రత పతాక ఆవిష్కరణ చేసి జెండా ఎగుర వేసి కార్యక్రమాన్ని ప్రారంభము చేసారు. ఆ తరువాత .ఏ. నరేంద్ర రెడ్డి (సీనియర్ జి.ఎం ఆపరేషన్స్) ప్రతి ఒక్క ఉద్యోగి రహదారి భద్రతా నియమాలను పాటించాలి. మరియు రోడ్డు ప్రమాదనికి మితిమీరిన వేగం, నిబంధనలను పాటించకపోవడం వంటివి చోటుచేసుకుం టున్నాయని చెప్పారు.ప్రతి వాహనచోదకుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్తో పాటు వాహనం రిజిస్ట్రేషన్ పేపర్ తదిత రాలను తప్పనిసరిగా దగ్గరుంచుకో వాలని సూచించారు. వాహనచోదకులు మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు.ఈ కార్యక్రమంలో బి .శ్రీనివాస్ రావు -ఎంవి ఐ మాచెర్ల, సురేష్ కుమార్ గారు ఎం.వి. ఐ (చెక్ పోస్ట్) ఏజీఎం హెర్ వీ.శంకర్ నారాయణ రెడ్డి,సీనియర్ మేనేజర్ సి హెచ్ .రామకృష్ణ,సేఫ్టీ మేనేజర్ సంజయ్ కుమార్ సింగ్, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రయ్యకు ఘన నివాళులు



మాచర్ల టౌన్, మేజర్‌న్యూస్

మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో రెండేళ్ల క్రితం హత్యకు గురైన తోట చంద్రయ్య వర్ధంతి కార్యక్రమం శనివారం మాచర్ల పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇంచార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి బ్రహ్మారెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక బీసీ నేతను పట్టపగలు నడి రోడ్డుపై వైసీపీ రౌడీలు హత్య చేయడం దుర్మార్గం అని, చంద్రయ్యను హత్య చేసేటప్పుడు జై జగన్ అనమంటే జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ చంద్రయ్య చనిపో వడం టీడీపీ కార్యకర్తలకు గర్వకారణం అని అన్నారు.చంద్రయ్య ను హత మార్చింది మా వాళ్లు కాదంటూ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడ టం హాస్యాస్పదం అని, దౌర్జన్యాలు, దోపిడీలు, దుర్మార్గాలకు కేరాఫ్ గా మాచర్ల నియోజకవర్గం మారిందని, ఇక్కడ చేసే అకృత్యాలు చూపేందుకు మాచర్ల నియోజకవర్గం అనే సినిమా తీసారంటే, నియోజకవర్గంలోని పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని బ్రహ్మారెడ్డి అన్నారు. పిన్నెల్లి సోదరుల ఆగడాలు హద్దు మీరాయని, నియోజకవర్గంలో పెళ్లిళ్లకు,పంక్షన్లకు ఎమ్మెల్యే సోదరుల పర్మిషన్ కావాలా అని బ్రహ్మా రెడ్డి ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, మాచర్లమండల అధ్యక్షుడు నేరేటి వీరస్వామి, పట్టణ అధ్యక్షుడు కొమెరా దుర్గారావు, మద్దిగపు పెద్ద వెంకటరామిరెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రం నాయక్, బాబు ఖాన్ పఠాన్, శ్రీనివాసరావు, అంజి, అన్వర్ భాష, చంద్రయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ధనుర్మాస వేడుకలు





వినుకొండ, మేజర్‌న్యూస్

ధనుర్మాసం పురస్కరించుకుని వినుకొండ ఎన్ఎస్పీ స్థలంలో వినుకొండ చిన్న జీయర్ స్వామి నిలయం నిర్వాహకులు భావనాసి మల్లికా ప్రసాద్ దంప తుల ఆధ్వర్యంలో భవ్య దంపతి పూజలు శ్రీ శ్రీ అహోబిల్లా రామానుజ స్వామి దివ్య ఆశీస్సులతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో శ్రీ లక్ష్మీ దేవి అమ్మవారికి పసుపు పూజ చేశారు. పసుపును వచ్చిన భక్తులకు దంపతులకు వాయినంగా స్వామీజీ చేతుల మీదుగా అందజేశారు. లక్ష్మీనారా యణ స్వామి ఆశీస్సులు భక్తులకు బాగుండాలని అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఉద్దేశంతో పూజా కార్యక్రమాలు శ్రీ చిన్న జీయర్ స్వామి మంగళ శాసనాలతో ఈ కార్యక్రమాలు చేశామని ప్రపంచ శాంతిని కోరుతూ ఈ పూజా కార్యక్రమాలు చిన్న జీయర్ స్వామి నిలయంలో ప్రతి సంవత్సరం కొనసాగుతున్నా యని అందులో భాగంగానే ఈ ధనుర్మాస పూజా కార్యక్రమాలు కూడా చేసినట్లు మల్లికా ప్రసాద్ పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమాలకు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దంపతులు లీలావతి , వినుకొండ సివిల్ జడ్జి కోర్టు అధ్యక్షులు వీరాంజనేయ చౌదరి దంపతులు కట్టా సుబ్బారావు దంపతులు హాజరయ్యారు తమ సేవలు ఎప్పుడు తమకు అందిస్తామని సేకరించారు పట్టణానికి చెందిన మహిళా దంపతులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# 33వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె





వినుకొండ, మేజర్‌న్యూస్

పట్టణం లోని సురేష్ మహల్ రోడ్ లో నేటికీ 33వ రోజుకు చేరిన అంగన్వాడి సమ్మె ప్రభుత్వం అంగన్వాడీలను చర్చలకు పిలిచి ఈ సందర్భంగా వేతనాలు ఇప్పుడే పెంచమని జూలైలో పెంచుతా మని చెప్పింది అలాంటప్పుడు అసలు చర్చలకు ఎందుకు పిలిచినట్లు ,అనీ సమ్మె చేస్తున్న వారిని మధ్యలో ఇలా పిలిచి అవమానించడమే కదా వేత నాలు పెంచే ఉద్దేశమే లేనప్పుడు అసలు చర్చలకు పిలవవలసిన అవసరం ఏముంది గ్రాడ్యుటి కోర్టులో పరిష్కారం కావాలి అన్నారు ప్రభుత్వం ఈ రోజు ఇంత మొండి వైఖరితో అంగనవాడీలను లక్ష మందిని అవమానించింది ఒక సలహాదారుడు బయటకు వచ్చి అంగన్వాడీల ఓట్లు మాకు అవస రం లేదు అంటున్నారు అంగన్వాడీల ఓట్లు ఒక లక్ష కాదు 50 లక్షలు మీరు ఓట్లు అడిగేటప్పుడు మాత్రం అందరూ గుర్తుకు వస్తారు ఇప్పుడు మాత్రం అంగన్వాడీల అవసరం లేదు ఈ వైకిరిని అందరూ విమర్శకు గురి అవుతున్నారు కానీ ఇప్పటివరకు అంగన్వాడీలు చాలా సహనంతో ఉన్నారు పండగ తర్వాత తమ సత్తా చూపిస్తారు ఎంత బెదిరించినా అంగన్వాడీలు వర్తిల్లకు లొంగిపోరు మీకు కచ్చితంగా ఫలితాలను ఇస్తారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు హనుమంత రెడ్డి శివరామకృష్ణ అంగలకుదురు ఆంజనేయులు అంగనవాడి జిల్లా కోశాధికారి లక్ష్మీ ప్రసన్న సెక్టార్ లీడర్లు దేవి కృష్ణ కుమారి జి పద్మ , పద్మ సిహెచ్ గాయత్రి నిర్మల డి బీబులు రంగలక్ష్మి హరిత నగరాజకుమారి బి శ్రీదేవి అంజలి పి ఉమాశంకరి నాగజ్యోతి మరియు అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొని నిరసన దీక్షలు తో తెలిపారు.

## నిత్యవసర సరుకుల ధరలను నిర్ణయించడంలో విఫలమైన ప్రభుత్వం: కన్నా





సత్తెనపల్లి ప్రతినిధి, మేజర్‌న్యూస్

సత్తెనపల్లి పట్టణం, రఘురామ్ నగర్ లో సంక్రాంతి పర్వదిన సందర్భంగా అంగరంగ వైభవంగా కన్నా లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలను ప్రతి ఒక్కరిని పలకరించి ముగ్గులను తిలకించిన మాజీ మంత్రివర్యులు, సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్చార్జి కన్నా లక్ష్మీనారాయణ, ముగ్గులు పోటీలకు న్యాయ నిర్ణేతగా విచ్చేసిన ముఖ్యఅతిథి డాక్టర్ పోట్ల అరుణకుమారి. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనా రాయణ మాట్లాడుతూ... నియోజకవర్గ స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని, మహిళా స్పందన బాగా వచ్చిందని, ప్రస్తుతం మహిళలకు భారమైన నిత్యవసర సరుకులు కూడా ఈ ప్రభుత్వం రేట్లు నిర్ణయించడం విఫలమైందని, గ్యాస్ ధర ఆకాశాన్ని అందుతుం దని ప్రతి ఒక్కటి జగన్ రెడ్డి ప్రభుత్వం అమ్ముతుం దని ఇసుక మద్యం అన్ని కూడా జగనే సొంతగా అమ్మటం ఆశ్చర్యకరంగా ఉందనన్నారు. తెలుగు దేశం పాలనలో ధరలన్నీ చాలా తక్కువ ఉన్నా యని, ఇప్పుడు చూస్తే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. అనంతరం గెలుపొం దిన మహిళలకు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి గద్దె భూలక్ష్మికి వాషింగ్ మిషన్ అందజేశారు. రెండవ బహుమతి మాధవికి మిక్సీ, మూడవ బహుమతి మిక్సీ, ఇలా పది బహు మతులు మిక్సీ లు అందజేశారు. కాగా ఈ పోటీల లో పాల్గొన్న ప్రతి ఒక్క మహిళకి వారిని ప్రోత్సహి ంచడానికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో ప్రముఖ వ్యాపారవేత్త దరువూరి నాగేశ్వ రావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి యెల్లినేడి రామస్వామి, రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీని వాసరావు, మున్సిపల్ మాజీ వైస్- చైర్మన్ అతు కూరి నాగేశ్వరావు, టౌన్ పార్టీ ప్రధాన కార్య దర్శి జానీ బాబు, రంగారావు, ఎన్ఆర్ఐ మాగు లూరి భాను, టిడిపి బెంగళూరు ఫోరం కన్వీనర్ లెనిన్, మైనార్టీ సెల్ కన్వీనర్ సయ్యద్ రాంబో బుడే, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు తోట అంబిక, పట్టణ మహిళా అధ్యక్షులు యెల్లినేడి లక్ష్మీ తులసి, కంబాల వెంకటేశ్వర్లు, పార్టీ అభిమానులు, పాల్గొన్నారు.

# నరసరావుపేటలో యూత్ మీట్



నరసరావుపేట, మేజర్ న్యూస్

బినరసరావుపేట లో నియోజకవర్గ స్థాయి గోపిరెడ్డి టాస్క్ ఫోర్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన “యూత్ మీట్ ం గ్రీట్ శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ యువనేత, ఏపీ శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ర్యాలీలో మోటర్ బైక్ మీద పాల్గొన్నారు. మరియు నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పలువురు ప్రముఖ డాక్టర్లు..ఆయన మాట్లాడుతున్నంతసేపు విద్యార్థులు కేరింతలు కొట్టారు..ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నియోజకవర్గం లోని యువత, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు, సోషల్ మీడియా కన్వీనర్లు, కో-కన్వీనర్లు, వివిధ అనుబంధ సంస్థలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, వార్డ్ ఇన్చార్జిలు, నియోజకవర్గ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చింతలపూడి ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

## విజేతలకు బహుమతులు అందజేసిన డాక్టర్ అశోక్‌కుమార్, రమ్యహారిక





పిడుగురాళ్ల, మేజర్‌న్యూస్: చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పిడుగురాళ్ల పట్టణంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. పట్టణంలోని ఆక్స్ఫర్డ్ స్కూల్ వద్ద గల పల్నాడు వయసిస్ వద్ద శనివారం సాయంత్రం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలలో మొదటి బహుమతి ఫ్రిజ్ నీ వీ .శిరీష , రెండవ బహుమతి కలర్ టీ వి.ని కే.అఖిల, మూడవ బహుమతి మిక్సర్‌నీ బి.నిర్మలరెడ్డిలు గెలుచుకున్నారు. విజేతలకు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చింతలపూడి శ్రీనివాసరావు, పల్నాడు హాస్పిటల్ వైద్యులు అశోక్ కుమార్, డాక్టర్ రమ్యహారికల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురజాల నియోజకవర్గం లో మండలాల వారీగా సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే గురజాల, దాచేపల్లి, మాచవరం మండలాల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించామన్నారు. ఈ పోటీలకు అనూహ్యస్పందన వచ్చిందని, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారన్నారు. పిడుగురాళ్ల మండలానికి సంభందించి ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీలకు భారతదేశం సమగ్రత అనే అంశాన్ని ప్రాతిపదికగా తీసుకొని నిర్వహించడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా స్థానిక ఎస్ఎఫ్ఐ నాయ కులు చింతలపూడి శ్రీనివాసరావు, డాక్టర్ అశోక్ కుమార్, రమ్యహారికల చేతుల మీదుగా ఎస్ఎఫ్ఐ జిల్లా 2024 క్యాలెండర్ ను ఆవిష్కరించారు.

## కొమ్మాలపాటి పరామర్శ



క్రోసూరు మేజర్‌న్యూస్:

గుడిపాడు గ్రామంలో అనారోగ్య కారణాలతో శస్త్ర చికిత్స చేయించుకున్న తడిక పల్లి కోటేశ్వరరావు ను పెదకూరపాడు మాజీ శాసన సభ్యులు కొమ్మలపాటి శ్రీధర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు పార్టీ నుంచి కానీ నా నుంచి కానీ అంది స్తానని హామీ ఇచ్చి కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తక్కెళ్లపాడులో వికసిత్ భారత్

దాచేపల్లి, మేజర్‌న్యూస్:

దాచేపల్లీ మండలం తక్కెలపాడు లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వ హామీ మా సంకల్పం.. అభివృధి చెందిన భారత దేశం. కార్యక్రమములో బీజేపీ దాచేపల్లీ మండల అధ్యక్షులు మువ్వల వెంకట మనోజ్ ఆరె.వెంకటేశ్వర్లు అనంత నరసింహారావు, ముదిగళ్ల పెద్ద సైదల్లి బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## బొల్లా చీరల పంపిణీ

వినుకొండ మేజర్ న్యూస్: నియోజకవర్గం లోని ఆడపడుచులకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలతో మీ అన్నగా చిరు కానుక అందిస్తున్నామని శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు తెలియజేశారు.

జనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గం లోని ప్రతి ఒక్క అక్కాచెల్లెమ్మలకు పండుగ కానుక ను అందించటమే ప్రధాన ఉద్దేశం అని శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. బొల్లా మాట్లాడుతూ, సంవత్సరంలో తొలి పండుగ పెద్ద పండుగ అయిన సంక్రాంతి పండుగ సందర్భంగా వినుకొండ నియోజక వర్గంలోని ప్రతి అడపడుచుకు తాను అన్న గా భావించి పండుగకు కానుక గా చీర పంపిణీ చేయటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ పండుగ అందరూ ఎంతో సాంప్రదాయ పద్ధతిలో జరుకుంటారని, రైతులందరికీ ఈ పండుగ ప్రధానమైనదని, అన్నారు. ఆ భగవంతుడి చల్లని దీవెనలు మనందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, ముందుగా అందరికీ భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు.

## ఉప్పలపాడు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

నూజెండ్ల మేజర్ న్యూస్: మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీ వీరభద్రాచారి మాట్లాడుతూ దేశానికి పల్లెటూరులు పట్టుకొమ్మలని, పల్లెలు బాగుంటే దేశం మరింతగా అభివృద్ధి జరుగుతుందని అలాగే ప్రతి ఒక్కరు కూడా పీఎం విశ్వకర్మ యోజన, పీఎం అటల్ పెన్షన్ యోజన, పీఎం ఉజ్వల పథకం, పీఎం కిసాన్, పీఎం ఆవాస్ యోజన మొదలగు పథకాల్లో అర్హులైన వారు ఈ పథకాలన్నీ ఉపయోగించుకొని తద్వారా మోడీ కలలుగన్న అభివృద్ధి చెందిన భారత్ నీ తొందరలోనే చూస్తామని దేశ రక్షణ కోసం ఆయన తీసుకుంటున్న చర్యలు భేష్ అని కొనియాడారు. ఆ తర్వాత అందరి చేత భారత్ సంకల్ప యాత్ర ప్రతిజ్ఞ కూడాచేయించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా



ఉపాధ్యక్షులు ఎండ్లూరు వీరయ్య, పల్నాడు జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షులు జెడ్డా లక్ష్మీనారాయణ, నూజెండ్ల మండలం బిజెపి అధ్యక్షులు పగడాల లక్ష్మీనారాయణ, ఉప్పలపాడు పంచాయితీ సెక్రటరీ చెన్నారావు, ఉపాధి హామీ ఏపీవో కట్ట నాగేశ్వరరావు, ఆయా శాఖ అధికారులు,లబ్ధిదారులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విజయపురిసౌత్ సబ్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డీ.వి కొండా రెడ్డి



విజయపురిసౌత్, మేజర్‌న్యూస్: నాగార్జునసాగర్, విజయపురిసౌత్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా డి.వెంకటకొండారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2018 బ్యాచ్ కు చెందిన వెంకట కొండా రెడ్డి బాపట్ల లో ఎస్ఐగా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు విజయపురిసౌత్ ఎస్ఐగా పనిచేసిన పి.అనిల్ కుమార్‌రెడ్డి బదిలీపై డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ కు వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ ఐ వెంకట కొండా రెడ్డి మాట్లాడుతూ విజయపురిసౌత్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఎలాంటి తారతమ్యాలకు చోటు ఇవ్వకుండా విధిని నిర్వహిస్తానని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి ఘర్షణలు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్.ఐ కు ఏ.ఎస్ఐ మస్తాన్ వలి అలాగే పోలీస్ స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## నాగార్జునకొండలో పర్యాటకుల సందడి


### లాంచీ స్టేషన్ ఆదాయం రూ.70,000



విజయపురిసౌత్, మేజర్ న్యూస్:

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండ ను శనివారం భారీగా పర్యాటకులు సందర్శించారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు వివిధ లాంచీలలో వెళ్లిన పర్యాటకులు కొండలోని మ్యూజియంలో ఉన్న బుద్ధిని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధ శాల, స్నానాల గట్టు, బోధి వృక్షం చూసి తన్మయం చెందారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపి స్టేడియం, అశ్వమేద యగ్నశాల, శ్రీ రంగనాథస్వామి దేవాలయం, తదనంతరం 60 అడుగుల ఎత్తునుండి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. శనివారం భారీగా పర్యాటకులు నాగార్జున కొండను సందర్శించడంతో లాంచీల ద్వారా 70,000 రూపాయల ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

## కాపు జేపసీ నూతన కార్యాలయం ప్రారంభం



మాచర్ల టౌన్, మేజర్‌న్యూస్:

కాపుల అభివృద్ధి కోసం కృషి చేస్తా అని కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు అన్నారు. శనివారం మాచర్ల నియోజకవర్గ కాపు జేఏసీ అధ్యక్షులు పసుపులేటి బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో మాచర్ల పట్టణం లో కాపు జేఏసీ నియోజకవర్గ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాపు జేఏసీ వ్యవస్థాపకఅధ్యక్షులు అమ్మ శ్రీనివాస్‌నాయుడు పాల్గొని ప్రారంభించారు. అనంతరం నూతనంగా ఎంపికయిన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమ కృష్ణమూర్తి, వట్టెం నరసింహారావు, జక్క నరసింహారావు, జక్కరవి, కోరే అంజి, వాడపల్లి రాంబాబు, సూదుల మల్లయ్య, పగడాల నాగేశ్వరరావు, కోరబోయిన సుబ్బారావు, కోరబోయిన రామారావు, పగడాల సుబ్బారావు, పగడాల సీతయ్య, భద్రయ్య, కోరబోయిన వెంకటేశ్వర్లు పలువురు నేతలు పాల్గొన్నారు.

# భారతదేశ ఆర్థిక వ్యవస్థ

## APPSC గ్రూప్-1, 2 JL, DL



## చిన్నతరహా పరిశ్రమలు

భారతదేశ ఎకానమీలో పరిశ్రమల రంగానికి చాలా కీలకమైన పాత్ర ఉంది. స్వాతంత్ర్యం తరువాత భారతప్రభుత్వం గ్రామీణ పరిశ్రమలకు అధిక ప్రాధాన్యతను కల్పిస్తూ పారిశ్రామిక తీర్మానాన్ని ప్రకటించింది.

- స్మాల్ ఈజ్ బ్యూటీఫుల్ అనే నినాదమును ప్రకటించింది.
- 2006 సం.నకు ముందు యస్‌యస్‌ఐ (స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్) అని పిలిచేవారు.
- 2006 సం. తరువాత మైక్రో స్మాల్ & మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇ) అని నూతన పేరుతో పిలుస్తున్నారు.
- భారతదేశ రాష్ట్ర పారిశ్రామిక పురోగతిలో ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇ చాలా కీలకమైనది.
- ఆర్థిక సంస్కరణల తరువాత ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇ చాలా తీవ్రంగా నష్టపోయింది.

**ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇ వలన ప్రయోజనాలు -**

- తక్కువ పెట్టుబడి సులభంగా ప్రారంభించుట
- ఎక్కువ ఉద్యోగ అవకాశాల కల్పన
- ప్రాంతీయ అసమానతలు తగ్గించుట
- పారిశ్రామిక వికేంద్రీకరణ
- వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుట
- ఎగుమతులను ప్రోత్సహించుట.
- తక్కువ నైపుణ్యము కలవారికి కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించుట.
- భారీ పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు ఇతర ఉత్పత్తులు అందించును.
- మూలధన వనరులను పారిశ్రామిక పెట్టుబడులుగా మార్చుట.
- పారిశ్రామిక యాజమాన్య సామర్థ్యం పెంచుటకు సహకరించును.

**ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇ-ప్రాధాన్యత :**

- 2015 ఎకనామిక్ సర్వే ప్రకారం

దేశం ఎగుమతుల్లో 40% వాటా కలిగి ఉండుట.

పారిశ్రామిక ఉత్పత్తిలో 45% వాటా.

దేశవస్తుసేవల ఉత్పత్తుల్లో ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇ వాటా 37.5%.

ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 8.05 కోట్ల జనాభా

**ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇ :**

- కేంద్రప్రభుత్వం గణాంక లెక్కల ప్రకారం 2005 ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో చిన్నపరిశ్రమల ద్వారా సగటున 8.8% మంది ఉపాధి పొందుతున్నారు.
- రాష్ట్ర ఎగుమతుల్లో చిన్నతరహా పరిశ్రమల వాటా 35% నుండి 40% వరకు ఉంది.
- ఆంధ్రప్రదేశ్‌లో చిన్నతరహా పరిశ్రమలు 3.5లక్షలు ఉంటాయని ఒక అంచనా. వీటిద్వారా 22 లక్షలు మంది ఉపాధి పొందుతున్నారు.
- చిన్నతరహా పరిశ్రమలు అధికంగా ఆగ్రో మరియు ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ఉన్నాయి.
- 23% చిన్నతరహా పరిశ్రమలు ఈ రంగంలో ఉన్నాయి.
- రాష్ట్రంలో వ్యవసాయ సంబంధమైన పరిశ్రమలు కాకుండా ప్రజలకు అధికంగా ఉపాధి కల్పించేది చిన్నతరహా పరిశ్రమల రంగం.
- 2021-22 సంవత్సరంలో రాష్ట్రంలో 5907 చిన్నతరహా పరిశ్రమలు ఉత్పత్తిని ప్రారంభించి 37604 మందికి ఉపాధిని అందిస్తున్నాయి.
- చిన్నతరహా పరిశ్రమలు వార్షిక వృద్ధి రేటు 15% సాధించాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- పారిశ్రామిక ప్రగతి సాధించడంలో ఎమ్.ఎస్ఎమ్.ఇలు చాలా కీలక పాత్రను పోషిస్తున్నాయి.
- 2006 ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇడి యాక్టు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇ ఫెసిలిటేషన్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసింది.
- కౌన్సిల్ ముఖ్య ఉద్దేశ్యం ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇలకు బాకీ పడిన మొండి బకాయిలను వసూలు చేయుటకు ప్రత్యేక చర్యలు తీసుకొనుట.
- ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇల ద్వారా గ్రామీణ ప్రాంతాలతో పాటు వెనుకబడిన ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయి.
- ఆదాయాలు అన్ని ప్రాంతాలలో సమానంగా పెరుగుతాయి.
- ప్రాంతీయ అసమానతలు పూర్తిగా తగ్గుతాయి.
- ఉపాధి కల్పనలో మరియు ఆర్థికాభివృద్ధి సాధించడంలో ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇలకు ప్రథమస్థానం కలదు.
- రాష్ట్రప్రభుత్వం ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇ పార్కులను కూడా అభివృద్ధి చేస్తున్నది.
- 2014-19లో రాష్ట్రంలో 37956 ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇల ద్వారా 404939 మంది ఉపాధి పొందుతున్నారు.
- ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇల ద్వారా పెట్టుబడుల విలువ 16206 కోట్లకు పెరిగింది.
- 2021-22లో ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇల పెట్టుబడి 1762 కోట్లు. వీటిద్వారా 37604 మంది ఉపాధి పొందినారు.
- 2022-23లో రాష్ట్రంలో 55761 పరిశ్రమలను ఏర్పాటు చేసినారు. వీటిద్వారా 2.27 లక్షల మందికి ఉపాధి లభించింది.
- 2022-23 ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇల యూనిట్ల పరంగా ర్యాంకులు ఇచ్చారు.
  - ర్యాంకు-1 ఏలూరు
  - ర్యాంకు-2 తిరుపతి
  - ర్యాంకు-3 విశాఖపట్నం
- 2022-23లో పెట్టుబడుల పరంగా ర్యాంకులు ఇచ్చారు.
  - ర్యాంకు-1 తిరుపతి
  - ర్యాంకు-2 అనకాపల్లి
  - ర్యాంకు-3 నెల్లూరు
- 2022-23 ఉపాధి పరంగా ర్యాంకులు :
  - ర్యాంకు-1 ఏలూరు
  - ర్యాంకు-2 అన్నమయ్య
  - ర్యాంకు-3 అనకాపల్లి

**చిన్నతరహా పరిశ్రమల బలాలు :**

- ఆర్థిక అసమానతలు తొలగిపోతాయి.
- ఎగుమతులలో పెరుగుదల ఉంటుంది.
- మూలధన పెట్టుబడి తక్కువగా ఉంటుంది.
- సరుకుల రవాణాలో మంచి అవకాశాలు ఉంటాయి.
- భారీ పరిశ్రమలకు, మధ్యతరహా పరిశ్రమలకు కావలసిన ముడిసరుకులు లభించును.
- ఉద్యోగ మరియు ఉపాధి అవకాశాలు ఎక్కువగా కల్పించబడును.
- స్థానిక వనరుల వినియోగం సక్రమంగా జరుగుతుంది.
- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి చాలా వేగవంతంగా జరుగుతుంది.

**చిన్నతరహా పరిశ్రమల బలహీనతలు :**

- కఠినమైన కార్మిక చర్యలు చేపట్టడం.
- తక్కువవడ్డీకి అవసరమైన ఋణాలను అందించలేకపోవడం
- కార్మికులకు యాజమాన్యానికి మధ్య వివాదాలు.
- ఉత్పత్తులకు సరైన మార్కెట్ సదుపాయాలు లేకపోవడం.
- యాజమాన్య నిర్వహణ లోపాలు ఉండటం.
- జిల్లా పరిశ్రమల సంస్థ మరియు ప్రభుత్వ పథకాలు విఫలమవటం.
- అధికంగా పన్నుల భారం వేయుట.
- పాతయంత్రాలు వాడకం ద్వారా ముడిసరుకుల వినియోగం పెరుగుట.
- అవస్థాపనా సౌకర్యాలలో వెనుకబడి ఉండడం.
- భారతదేశంలో ఖాయిలా పడ్డ చిన్న పరిశ్రమలశాతం 21% అయితే ఆంధ్రప్రదేశ్‌లో 27% ఉంది.
- ఆర్థిక సాంఘిక కార్యకలాపాలు సరిగా నిర్వహించలేకపోవుట.

**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ చర్యలు :**

- రాష్ట్రప్రభుత్వంతో పోల్చితే కేంద్రప్రభుత్వం చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి చాలా చర్యలు చేపట్టింది. రాష్ట్రప్రభుత్వం ఇటీవల ప్రకటించిన నూతన పారిశ్రామిక పాలసీలో ఈ రంగానికి చాలా రాయితీలను ప్రకటించింది.

**కేంద్రప్రభుత్వ చర్యలు :**

- చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించుటకు కేంద్రప్రభుత్వం కొన్ని బోర్డులను ఏర్పాటు చేసింది.
  - అఖిల భారతచేతివృత్తుల బోర్డు - న్యూఢిల్లీ
  - చిన్నతరహా పరిశ్రమల బోర్డు - న్యూఢిల్లీ
  - గ్రామీణ పరిశ్రమల బోర్డు - న్యూఢిల్లీ
  - చేనేత పరిశ్రమల బోర్డు - న్యూఢిల్లీ
  - కొబ్బరిపీచు పరిశ్రమల బోర్డు - కొచ్చిన్
  - కేంద్రసిల్కు బోర్డు - బెంగుళూరు

**అఖిల భారత సంస్థలు :**

- 1954 యస్‌ఐడిఓ (స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) సహకారంతో చిన్నతరహా పారిశ్రామిక వేత్తలకు నైపుణ్య శిక్షణ ఏర్పాటు చేయుట
- ఎగుమతులు ప్రోత్సహించుటకు ప్రభుత్వానికి సలహాలు అందించుట.
- 1955-ఎన్‌యస్‌ఐసి (నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పోరేషన్) కింద కార్యక్రమాలను నిర్వహించును.
- చిన్నతరహా పరిశ్రమలకు కావలసిన ఆర్థిక సాంకేతిక సహాయమును అందజేయుట.
- చిన్నతరహా సంస్థలు ఉత్పత్తి చేయు వస్తువులకు విక్రయ సదుపాయాలు కల్పించుట.
- ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమల ఉత్పత్తులను కొనేలా చేయడం.
- చిన్నతరహా పరిశ్రమల శిక్షణా కేంద్రాల అభివృద్ధికి కృషి చేయుట.
- ఉత్పత్తి అయిన వస్తువులు దేశం మరియు విదేశాలలో అమ్మేందుకు సహకరించుట.
- అధికంగా పారిశ్రామిక క్షేత్రాలను నిర్మించుట.
- దిగుమతి అయిన యంత్రాలను చిన్నతరహా పరిశ్రమలకు పంపిణీ చేయుట
- చిన్న పరిశ్రమలను పెద్ద పరిశ్రమలతో అనుసంధానం చేసి వాటి అభివృద్ధికి కృషి చేయుట
- 1957చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి కోసం కెవిఐసి (ఖాదీవిలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్)ను ఏర్పాటు చేసారు.
- 1962లో జాతీయ స్థాయిలో ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇల నైపుణ్యంలో భాగంగా శిక్షణ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ సేవలు అందిస్తున్నారు.
- 1990 యస్‌ఐడిబిఐ (స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) లక్ష్యం విత్త సదుపాయం లేదా ఋణ సదుపాయం అందించుటలో ప్రథమస్థాయిని చేరింది.
- 1993ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ గౌహతి కేంద్రంగా ఏర్పాటు చేసారు.
- 2006లో ఎమ్‌ఎస్‌ఎమ్‌ఇ డెవలప్‌మెంట్ సెంటర్ పేరుతో కేరళలో ఒక శిక్షణా కేంద్రమును ప్రారంభించారు.

**ఇతర చర్యలు :**

- యస్‌యస్‌ఐ (స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ రిజర్వ్‌డ్ లిస్ట్) 1970 ప్రకారం 180 రకాల వస్తువులను ఈ లిస్టులో చేర్చి యస్‌యస్‌ఐలు మినహా మిగిలిన వాటిని ఉత్పత్తిలో చేర్చలేదు.
- 1978లో డిఐసి సెంటర్స్‌ని ఏర్పాటు చేసారు.

**కోశాపరమైన ప్రోత్సాహకాలు :**

- కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న పరిశ్రమ లకు కొన్ని కోశాపరమైన ప్రోత్సాహకాలను కల్పించారు.
- పెట్టుబడి రాయితీలు
- వెనుకబడిన ప్రాంతాలలో స్థాపించిన పరిశ్రమలకు ఎక్కువ సబ్సిడీలు ద్వారా అభివృద్ధి జరుగును.
- నూతన పరిశ్రమలకు 5 సంవత్సరాల వరకు టాక్స్ మినహాయింపు ఇచ్చుట.
- న్యూక్లియస్ పరిశ్రమల పథకం
- పారిశ్రామిక కార్యకలాపాలు లేని ప్రాంతాలలో ఒక మౌళిక పరిశ్రమ స్థాపించి దానిచుట్టూ అనేక చిన్నపరి శ్రమలు అభివృద్ధి చేయు పథకం ప్రారంభించినది.
- చిన్న పరిశ్రమలు ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయుట ద్వారా పరిశ్రమల వృద్ధి జరిగింది.



Dr.M.Reddi Ramu,
Proffessor
Viswam Eng ineering
College, Angallu

### తిరుమల తిరుపతి దేవస్థానంలో 78 డిగ్రీ, జూనియర్ లెక్చరర్ పోస్టులకు నోటిఫికేషన్

తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానాలు శాశ్వత ప్రాతిపదికన తితిదే డిగ్రీ కాలేజీలు, ఓరియంటల్ కాలేజీల్లో డిగ్రీ లెక్చరర్లు, తితిదే జూనియర్ కాలేజీల్లో లెక్చరర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 78 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. సంబంధిత స్పెషలైజేషన్‌లలో డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. అలాగే హిందూ మతానికి చెందిన వారై ఉండాలి. అభ్యర్థుల వయోపరిమితి జులై 1, 2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అయిదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.డిగ్రీ లెక్చరర్ పోస్టులు 49 వరకు ఉన్నాయి. సంబంధిత స్పెషలైజేషన్‌లో కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. అలాగే నెట్/స్లెట్‌లో అర్హత సాధించి ఉండాలి.జూనియర్ లెక్చరర్ పోస్టులు మొత్తం 29 ఉన్నాయి. కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత స్పెషలైజేషన్‌లో మాస్టర్స్ డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి.

# అంగన్వాడీలను బెదిరించడం దుర్మార్గపు చర్య

– అంగన్వాడీల సమ్మెకు కాంగ్రెస్ అండ
రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ డిపార్ట్మెంట్ కార్యదర్శి కరాలపాటి జానీ




దాచేపల్లి, మేజర్‌న్యూస్: అంగన్వాడీల సమస్యల పరిష్కారం చేయకుండా వారిని బెదిరించే ధోరంలో మాట్లాడటం ప్రభుత్వానికి తగదని రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ డిపార్ట్మెంట్ కార్యదర్శి కరాలపాటి జానీ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెల రోజులుగా అంగన్వాడీల సమ్మె చేస్తున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్టుగా కూడా లేదని ఇది మంచి పద్ధతి కాదని జానీ అన్నారు. అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ చేస్తున్న సమ్మెపై ప్రభుత్వ రాజకీయ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, అంగన్వాడీలు విధుల్లో చేరకపోతే మీ ఉద్యోగాలు ఊడినట్లేనని బెదిరించటం దుర్మార్గమైన చర్యగా జానీ అన్నారు.దీనిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.గత 40 సంవత్సరాల నుంచి ఉద్యోగాలు చేస్తున్న అంగన్వాడీలు మీ తాటాకు చప్పుళ్లకు భయ పడరని, మీ బెదిరింపులకు, తలవగ్గరన్నారు. మీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే వరకు వారు సమ్మె విరమించబోరని, వారి న్యాయమైన సమ్మెకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఉన్న 1.10 లక్షల మంది అంగన్వాడి ఉద్యోగులు రానున్న ఎన్నికలలో మీ భరతం పట్టడం ఖాయమన్నారు. అంగన్వాడీల , ఉద్యోగాలు పోవటం ఏమో కానీ? 2024 ఎన్నికల తర్వాత సజ్జల! ఉద్యోగం ఊడిపోవడం ఖాయమన్నారు. పంచాయతీ కార్యాలయాలకు, సచివాలయాలకు మీ పార్టీ రంగులు వేయడానికి, తీయడానికి రూ.1400 కోట్ల రూపాయలు దుబారుగా ఖర్చు చేసిన మీరు, అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు ఒక వెయ్యి కోట్ల రూపాయలు ఇవ్వటానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదా? అని ప్రశ్నించారు. గత నెల రోజుల నుంచి సాగుతున్న అంగన్వాడీల ఉద్యమంలో ఇప్పటివరకు 9 మంది సమిధులయ్యారన్నారు. అంగన్వాడీల ఆడబిడ్డల"కన్నీటిలో వైసిపి ప్రభుత్వం"కొట్టుకుపోవడం ఖాయమని కరాలపాటి జానీ హెచ్చరించారు.

## నరసరావుపేట సంక్రాంతి సంబరాలు
### పల్నాడు జిల్లా కలెక్టర్ శంకర్



నరసరావుపేట మేజర్‌న్యూస్: ఈనెల 14 నుంచి 16 వరకు పల్నాడు జిల్లాలో సంక్రాంతి సంబరాలు నరసరావుపేట కేంద్రంగా జరుగుతాయి పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ అన్నారు. భారతీయ తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలాగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సంక్రాంతి అంటే పంటలు ఇంటికి వచ్చే పండగ కాబట్టి అనేక ప్రదర్శనలతో కూడిన స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. పల్నాడు జిల్లా వాసులందరూ కుటుంబంగా ఏర్పడి పండగ జరుపుకోవాలని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పలువురు కళాకారులచే నృత్యాలు,రఘు కుంచె, ఎంఎం శ్రీలేక వంటి పలువురు గాయ కులచే పాటలు, జబర్దస్త్ టీం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. పల్నాడు సంస్కృతి ఉట్టిపడేలా లేజర్ షో,మ్యాజిక్ షో,డాన్స్,రష్యన్ కళాకారులచే ప్రత్యేక కార్యక్రమం ఉంటుంద న్నారు. జిల్లా వ్యాప్తంగా 100 సంవత్సరాలు దాటిన వయో వృత్తులు 110 మంది ఉన్నారని అన్నారు. వారిని సన్మానించుకో వాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు జరిగిన పలు అభివృద్ధి కార్యక్ర మాలకు సంబంధించి ఫోటో ఎగ్జిబిషన్..వినోదంతో పాటు చేశామ న్నారు. దీనివల్ల పిల్లలకు నాలెడ్జ్ పెరుగుతుందన్నారు. లోకల్ టాలెంట్ ఉన్నవారికి గతంలో ఏదైనా స్టేజిపై ప్రదర్శనలు చేసిన వారికి స్పాట్ రిజిస్ట్రేషన్తో స్టేజిపై ప్రదర్శించే అవకాశం కల్పించామన్నారు. ఆసక్తి కలిగిన కళాకారులు ఎవరైనా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని వారి ప్రతిభను ప్రదర్శించే విధంగా ఒక వీడియోని చూపించి స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకుని పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. వారికి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు ఉంటాయన్నారు.

## దుర్గి నూతన ఎస్ఐగా ఎస్.కొటయ్య




దుర్గి, మేజర్‌న్యూస్: దుర్గి నూతన ఎస్సైగా ఎస్. కొటయ్య శనివారం బాధ్య తలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పిడుగురాళ్ల నుండి బదిలీపై అయిన దుర్గి పోలీసుస్టేషన్‌కి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లా డుతూ దుర్గి మండలంలో శాంతిభద్రతలపై ఎల్లవేళలా పర్యవేక్షణ ఉంటుందని ఎస్సై కోటయ్య తెలిపారు.

## క్రికెట్ కిట్లు పంపిణీ




మాచర్ల టౌన్, మేజర్‌న్యూస్: జనసేనపార్టీ మాచర్ల మండల అధ్యక్షులు గుండె బోయిన సాంబశివరావు ఆధ్వర్యంలో పట్టణంలోని సాంబన్న యువతకి పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో క్రికెట్ కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పులి హరి, గుండెబోయిన సాంబ శివరావు మాట్లాడుతూ నేటి యువతే రేపటి దేశ భవిత అని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, దేశ రాష్ట్ర ప్రయోజనాల కోసం తమ వంతు కృషి చేయాలని కోరారు. రానున్నది జనసేన తెలుగుదేశం ప్రభుత్వంమేని తమ ప్రభుత్వంలో యువతకు వారి పరిస్థితులను బట్టి తప్పనిసరిగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నక్షత్రపు ప్రసాద్, భూసా రామాంజనేయులు, తోటకూర శ్రీనివాసరావు, గంధం మల్లయ్య కొప్పుల వెంకటరమణ, సాంబన్న యూత్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ కేటుగాళ్లతో తస్మాత్ జాగ్రత్త




పిడుగురాళ్ల, మేజర్‌న్యూస్: సైబర్ కేటుగాళ్ల ప్రలోభాలకు లొంగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరారు. శనివారం విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ గత కొంతకాలంగా సైబర్ మోసగాళ్లు వివిధ రూపాలలో ప్రజలను ప్రలోభాలకు గురి చేసి వారి సొమ్ము దోచుకుంటున్నారన్నారు. ప్రభుత్వము, పోలీస్ యంత్రాంగం సైబర్ నేరాలపై పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని. అయినప్పటికీ నేటి ఆధునిక, సాంకేతికలను అందిపుచ్చుకున్న కొందరు కేటుగాళ్లు ప్రజలను ప్రలోభాలకు గురిచేసి వారి ఖాతాలలోని నగదు దోచుకుంటున్నారన్నారు. ప్రజలు సైబర్ కేటుగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ క్రమంలో కొందరు మోసగాళ్లు అయోధ్య రామ మందిరం దర్శనం చేపిస్తామంటూ నమ్మబలికి బ్యాంకు ఖాతాలకు లింక్ చేయబడిన వారి సాఫ్ట్ వేర్ లింకులు ద్వారా, ఓటిపిల ద్వారా ప్రజలను మోసం చేసే అవకాశం ఉందన్నారు. ఇటువంటి మోసాలపై ప్రజలు అప్రమత్తతో వ్యవహరించాలని కోరారు.

## కంభంపాడు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర



నూజెండ్ల మేజర్‌న్యూస్: మండలంలోని తెల్లబాడు, కంభంపాడు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మేడం రమేష్ మాట్లాడుతూ దేశానికి పల్లెటూరులు పట్టుకొమ్మలని, పల్లెలు బాగుంటే దేశం మరింతగా అభివృద్ధి జరుగుతుందని అలాగే ప్రతి ఒక్కరు కూడా పీఎం విశ్వకర్మ యోజన, పీఎం అటల్ పెన్షన్ యోజన, పీఎం ఉజ్వల పథకం, పీఎం కిసాన్, పీఎం ఆవాస్ యోజన మొదలగు పథకాల్లో అర్హులైన వారు ఈ పథకాలన్నీ ఉపయోగించుకొని తద్వారా మోడీ కలలుగన్న అభివృద్ధి చెందిన భారత్ నీ తొందరలోనే చూస్తామని దేశ రక్షణ కోసం ఆయన తీసుకుంటున్న చర్యలు భేష్ అని కొనియా డారు. ఆ తర్వాత అందరి చేత భారత్ సంకల్ప యాత్ర ప్రతిజ్ఞ కూడాచేయించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్ డి రవికుమార్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మేడం రమేష్ రమేష్, డాక్టర్స్, పంచాయతీ కార్యదర్శులు చెన్నారావు, ప్రభుకుమార్ దీపిక మంజూష, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, బిజెపి మండల అధ్యక్షులు పగడాల లక్ష్మీనారాయణ ఆయా శాఖల అధికారులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.

# లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా కేసు వాదించిన రమణారెడ్డి



వినుకొండ మేజర్ న్యూస్: స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయవాది పీవీ రమణారెడ్డి లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గా వినకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నియమించగా ముద్దాయి తరఫు ఉచితంగా కేసు చేయడం జరిగింది.

బొల్లాపల్లి మండలం సీతారామపురం తండా కు చెందిన వడితే సత్తా నాయక్ హత్య కేసులో ముద్దాయి కాగా తన తరఫున వాదించేందుకు న్యాయవాదిని నియమించే స్తోమత లేదని వినకుండా జూనియర్ సివిల్ జడ్జి గారి సమక్షంలో అప్పీలు చేసుకోవడంతో వినుకొండ జడ్జి గారు ముద్దాయి తరఫు వాదించేందుకై లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గా పీవీ రమణారెడ్డిని అక్టోబర్ 27 న నియమించారు. హత్య కేసులో ముద్దాయి సత్తా నాయక్ కు బెయిల్ వేయగా జనవరి 12న నరసరావుపేట జిల్లా కోర్టులో బెయిల్ మంజూరు అయింది.

అలాగే గతంలో వినుకొండ పట్టణంలోని మసీదు మాన్యానికి చెందిన రాపూరి నరసింహారావు అనే ముద్దాయి తరఫున జడ్జి ఆదేశాల మేరకు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గా వ్యవహరించి ముద్దాయికి ఉచితంగా కేసు చేయడం జరిగింది. న్యాయవాదులను నియమించుకునే ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్న ముద్దాయిలకు కోర్టు ఆదేశాలతో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గా ముద్దాయి తరుపున ఉచితంగా వ్యవహరిస్తూ సేవలు అందిస్తున్న పీవీ రమణారెడ్డిని పలువురు న్యాయవాదులు అభినందించారు.